ఎంజీఐటీలో క్యాంపస్ క్లీనింగ్



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా క్యాంపస్ క్లీనింగ్‌తో పాటు తల్లి పేరుతో ఓ మొక్క నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం– స్వచ్ఛదనం ద్వారా మనమంతా ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ బాల్‌రెడ్డి, క్యాంపస్ నిర్వహణ ఇంచార్జి, జయరాం, సైదులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సభ్యుడికి స్వాగతం



విజయ్‌కుమార్ స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: జాతీయ ఎస్సీకమిషన్ మాజీ సభ్యుడు విజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆయనకు విమానాశ్రయంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎస్సీ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ తదితరులున్నారు.

ఈ నెల 28న 'మెగా జాబ్ మేళా'

మైలార్‌దేవ్‌పల్లి: నిరుద్యోగ పట్టభద్రులకు మహావీర్ విద్యాసంస్థల ప్రోత్సాహక 'మెగా జాబ్ మేళా' ఈ నెల 28న జరుగుతుందని కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ధనుంజయ్ పేర్కొన్నారు. దీనికి అనుబంధంగా జరిగే అన్ని నియామక విధానాలతో విద్యార్థులు, పట్టభద్రులు ఔత్సాహికంగా పాల్గొనాలని సంస్థ (ఎంఐఎస్‌టీ) ప్రిన్సిపాల్ ఉషాశ్రీ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

అత్తాపూర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ పిస్తా హౌస్ మంచి పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్–వే ప్రాంతంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతోపాటు మృతదేహం ఒంటిపై లైట్ పింక్ కలర్ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉందని, మృతుడి ఆచూకీ తెలిసినవారు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన కుటుంబానికి కాలనీవాసుల భరోసా



రాజేంద్రనగర్: ఆ కాలనీవాసులంతా ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు పాలుపంచుకుంటూ అండగా ఉంటున్నారు. కాలనీలో ఎవరు మృతి చెందినా కాలనీవాసులంతా ఏకమై వారికి తామున్నామంటూ భరోసా కల్పిస్తూ నగదు సహాయాన్ని అందజేస్తుంటారు. రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ ఇందిరానగర్ కాలనీ ఉంది. ఈ కాలనీలో ఉన్న వారంతా నిరుపేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. కాలనీ పెద్దగా అల్లాడి దేవదాస్ గౌడ్ వ్యవహరిస్తున్నారు. గత 5 సంవత్సరాలుగా కాలనీలో ఎవరూ మృతి చెందినా కాలనీ పెద్దలు, యువకులంతా వారి ఇంటికి వెళ్లి తామున్నామని భరోసా ఇవ్వడంతో పాటు కొంత నగదును అందజేస్తున్నారు. తద్వారా తామంతా ఒకే కుటుంబంగా ఉన్నామని తెలుపుతున్నామని దేవదాస్ గౌడ్ తెలిపారు. బస్తీలో మృతి చెందిన కుటుంబానికి మంగళవారం కాలనీవాసులంతా వెళ్లి ధైర్యం చెప్పారు. మేమంతా మీ వెంటే ఉన్నామని ధైర్యం చెప్పి కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అంజయ్య, రమేష్, మహేష్, సతీష్, శ్రీకాంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడుపై దాడికి యత్నం

శంషాబాద్ రూరల్: తనపై కొందరు దాడికి యత్నించి కారు అద్దాలను ధ్వంసం చేశారంటూ ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముచ్చింతల్‌కు చెందిన నర్సింహ మంగళవారం తన కారులో వెళ్తుండగా పీ–వన్ రోడ్డు పక్కన ఉన్న జిమ్స్ ఆసుపత్రి వద్ద కొందరు అతని కారును అడ్డగించి కారు అద్దాలను ధ్వంసం చేశారు. తనపై దాడికి యత్నించిన కత్తుల జనార్దన్‌తో పాటు మరి కొందరిపై చర్యలు తీసుకోవాలని నర్సింహ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జడివానలతో నేలకొరిగిన మహా వృక్షాలు





అత్తాపూర్: ఇటీవల కురిసిన జడివానల కారణంగా అత్తాపూర్ మూసి పరివాహక ప్రాంతంలో దశాబ్దాలుగా ఉన్న యూక లిప్టస్(నీలగిరి) మహావృక్షాలు నేలకొరిగాయి. వర్షంతో పాటు బలమైన గాలులు వీయడంతో ఎలక్ట్రికల్ కేబుల్ వైర్లు చల్లాచెదురయ్యాయి. దీంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురైయ్యారు. భారీగా కురిసిన వర్షంతో అత్తాపూర్, హైదర్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు మూసిలోకి భారీగా చేరాయి. వరదధాటికి మూసి పరీవాహక ప్రాంతాల్లో గట్టుకోతకు గురైయ్యాయి. మరి కొంతమంది మూసి పరివాహక ప్రాంతాన్ని కబ్జాచేసే ప్రయత్నంలో టన్నుల కొద్ది వ్యర్థాలను తెచ్చి మూసిని మూసివేసే ప్రయత్నంలో ఉన్నారు. మూసి పరీవాహక ప్రాంతం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. నార్సింగి నుంచి నాగోల్ వరకు మూసి పరీవాహకంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరారు.



అత్తాపూర్‌లోని జీహెచ్‌ఎంసీలో ఏర్పాటు చేసిన పార్కులో నేలకొరిగిన చెట్లు



సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో మార్కండేయనగర్ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి: కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. మార్కండేయనగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు అధ్వానంగా మారాయని మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నివాసంలో కాలనీ వాసులు మొర పెట్టుకున్నారు. గత 15 సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లు వేయలేకపోతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమస్యలను తప్పని సరిగా పరిష్కరిస్తానని, ముందుగా డ్రైనేజీ సమస్య తీర్చి, అనంతరం రోడ్లు వేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్ గౌడ్, మార్కండేయనగర్ కాలనీ వెల్ఫేర్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

శంషాబాద్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సూచించారు. పట్టణంలోని మహిళా మండలి ప్రాంగణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వారికి సబ్బులు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు సబ్బుల పంపిణీ చేస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై అందరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవా' 2024 కార్యక్రమంలో భాగంగా 'స్వభావ్ స్వచ్ఛతా, సంస్కార్ స్వచ్ఛతా' అనే థీమ్‌తో అజీజ్‌నగర్‌లోని కేఎల్ యూనివర్సిటీ, దర్గాఖలీజ్‌ఖాన్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని చెత్త, గడ్డి మొక్కలను తొలగించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర



మొక్కలు నాటుతున్న కమిషనర్, తదితరులు

ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. కళాశాలలు, పాఠశాలలో 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సైతం పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లా, కోఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, మేనేజర్ మంజులత, ప్రొఫెసర్ డాక్టర్ మల్లేష్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దీప్తి, డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో దూరవిద్య ప్రవేశాలకు 30 ఆఖరు

రాయదుర్గం: 'మనూ'లో దూరవిద్య ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు అని 'మనూ' సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ గుల్ఫిషాన్ హబీబ్ తెలిపారు. ఈ ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారమ్ యూనివర్సిటీ వెబ్‌సైట్, అడ్మిషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశ రుసుమును అక్టోబర్ 10వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు.. స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ హెల్ప్‌లైన్లు 040–23008463, 040 23120600, (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)లో సంప్రదించాలని సూచించారు.

'ఎస్కీ'లో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ

రాయదుర్గం: గాంధీజీ స్వచ్ఛమైన, శుభ్రమైన భారత్‌ను కోరుకున్నారని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ'లో మంగళవారం స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత ప్రచారంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజుకు రెండు గంటల చొప్పున సంవత్సరానికి వంద గంటలు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్కీ ఉన్నతాధికారులు లక్ష్మీకాంతరావు, ఆదినారాయణ, అనిత, అగర్వాల్, చంద్రకళ, సయ్యద్ అజ్గర్, ప్రశాంత్, రాజశేఖర్‌రెడ్డి, తిలక్, సునీత, కవిత పాల్గొన్నారు

సీఓఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేత

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ పరిసరాల్లో గల సాయిబాబా నగర్, డిఫెన్స్ కాలనీకి కిస్మత్‌పూర్, కాళీమందిర్‌ల మీదుగా బస్సులు నడపాలని బహుజన సాహిత్య అకాడమీ బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత మల్లారెడ్డి ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కేంద్ర కార్యాలయంలో బస్సు భవన్‌లో చీఫ్ ఆపరేషన్ అధికారి రవీందర్‌ను కలిసి విన్నవించారు. కిస్మత్‌పూర్ పరిసర ప్రాంతం సాయిబాబా నగర్ కాలనీ, డిఫెన్స్ కాలనీలతో పాటు ఓంనగర్ వివిధ కాలనీలకు బస్సు సౌకర్యం లేక ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మెహిదీపట్నం, ఆరాంఘర్, సికింద్రాబాద్, కోఠి, చేవెళ్ల, మొయినాబాద్ తదితర ప్రాంతాలకు కిస్మత్‌పూర్, కాళీమందిర్ మీదుగా వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారన్నారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.



ఆర్టీసీ సీవోవో రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లారెడ్డి

భారీ వర్షంతో రహదారులు జలమయం



కురుస్తున్న భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా 45 నిమిషాల పాటు కురిసిన వర్షానికి రహదారులన్నీ వర్షాపు నీటితో నిండుకున్నాయి. ప్రధానంగా దుర్గానగర్, గగన్‌పహడ్, శివరాంపల్లి, నేషనల్ పోలీసు అకాడమీ, ఉప్పర్‌పల్లి, బుద్వేల్, రాజేంద్రనగర్ యూనివర్సిటీ రోడ్డు, కిష్టమ్మ గుట్ట రహదారుల్లో వర్షాపు నీరు నిలిచిపోయింది. వరదనీటి కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులతో పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరదనీరు వెళ్లేందుకు తగు ఏర్పాట్లు చేపట్టారు. ఈ రహదారిపై వర్షం పడిన ప్రతిసారి వరదనీరు నిలిచి ఇబ్బందులు ఏర్పడుతుంటాయని, ఈ విషయం పై జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి విద్యార్థిపైన ఉందని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛత హీ సేవా' అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తమ ఇంట్లో ఉన్న చెత్తను స్వచ్ఛ ఆటోలో వేసే విధంగా తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. రోడ్లపై చెత్తను వేయడం ద్వారా విష జ్వరాలు వస్తాయని, రోడ్లు శుభ్రంగా ఉంటేనే సర్కిల్ ప్రజలు బాగుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ(ఎస్‌డబ్ల్యుఎం),ఎస్ఎస్, ఎంటమాలజీ టీమ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛత హి కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీ రవికుమార్



చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలని సూచిస్తున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్ అధికారులు

చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మణికొండ: చెరువులు, వాగులు మనకు జలభాండాగారాలుగా ఉపయోగపడతాయని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకుని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ పెద్ద చెరువులో పెరిగిపోయిన గుర్రపు డెక్కను సిబ్బందితో తొలగింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్రపుడెక్క వ్యాప్తిని ఎప్పటికప్పుడు అరికడితేనే సమస్య రాకుండా ఉంటుందన్నారు. తరచూ గుర్రపుడెక్కను తొలగించి దోమల వ్యాప్తిని అడ్డుకుంటున్నామన్నారు.

చెత్తను వేరు చేసి ఇవ్వాలి..

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, దీంతో పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా 15వ వార్డు హనుమాన్‌నగర్ కాలనీలో పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయటం గురించి కౌన్సిలర్ కావ్యశ్రీరాములుతో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి సంపత్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పెద్ద చెరువులో గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది

రోడ్లను అభివృద్ధి చేస్తాం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో అవసరమైన అన్ని రోడ్లను అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ నుంచి రూ. 48 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వార్డు పరిధిలో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం కొనసాగుతుందన్నారు. వాటికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల లాంటి మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



వెస్ట్రన్ మెడోస్ టౌన్షిప్ రోడ్డు పనులను ప్రారంభించిన కౌన్సిలర్

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని 7, 15, 16 వార్డులతో పాటు వట్టినాగులపల్లి చెత్త డంపింగ్ యార్డులో రూ. 2.86 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వస్తున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ డే



మానవ హారంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్)డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగం వాలంటీర్లు 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్‌ని వినియోగించవద్దని, చెత్తను, వ్యర్థపదార్థాలను తొలగించి, పర్యావరణాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్స్ మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ ముఖ్య ఉద్దేశం విద్యార్థులు దేశ సేవలో పాల్గొన్నడానికి అవకాశం కల్పిస్తుందని ముఖ్యంగా జాతీయ సేవ పథకం ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను పెంపొందిచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు వివిధ రంగాలలో పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల డీన్ ప్రశాంత్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు సీఎస్ఆర్ సంతోషిని, లావణ్య, శ్రీరాములు, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు నరేందర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఎన్‌ఎస్‌ఎస్ డేలో భాగంగా శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు